# నేడు అక్కినేని పురస్కారాల ప్రదానోత్సవం

## ★ అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తోటకూర ప్రసాద్

సబ్‌కలెక్టరేట్, డిసెంబర్ 16: అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గుడివాడ ఎఎన్ఆర్ కళాశాలలో అక్కినేని అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ అక్కినేని జీవితం యువతకు స్ఫూర్తి కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లో ప్రముఖులకు అక్కినేని అంతర్జాతీయ పురస్కారాలు ఇవ్వాలని సంస్థ సభ్యులు నిర్ణయించారని, మొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలియజేశారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో డాక్టర్ కె.ఐ వరప్రసాద్‌రెడ్డి, న్యాయం, చట్టం రంగంలో జస్టిస్ ఎస్.పర్వతరావు, పౌరసేవల విభాగంలో ఐఎఎస్ అధికారి పి సంపత్‌కుమార్, విద్యారంగంలో యంఎస్ రాజు, చలనచిత్ర రంగంలో దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు, సామాజిక సేవా రంగంలో డాక్టర్ వంశీ రామరాజు, రంగస్థల రంగంలో గుమ్మడి గోపాలకృష్ణ, వైద్య రంగంలో డాక్టర్ గోపీచంద్ మన్నెం, క్రీడా రంగంలో వెన్నం సురేఖలకు ఈ పురస్కారాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు అక్కినేని కుటుంబ సభ్యులతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ హాజరవుతారని చెప్పారు. అక్కినేని వ్యక్తిత్వం, జీవితం యువతరానికి ఓ స్ఫూర్తి సంతకం పేరుతో వ్యాసరచన పోటీలను నిర్వహించామని సుమారు 2500 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో మొదటి బహుమతి ఎం.వెంకట శివప్రసాద్ (50వేలు), రెండో బహుమతిగా 30వేల రూపాయలను విజయనగరం జిల్లాకు చెందిన బి.శంకర నారాయణ, మూడో బహుమతిగా 20వేల రూపాయలను బెంగుళూరుకి చెందిన ఎం.శ్రీవంశీకి అందజేస్తున్నామని ప్రసాద్ తెలిపారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తొమ్మిది అడుగుల అక్కినేని విగ్రహాన్ని ఈసందర్భంగా ఆవిష్కరిస్తామని చెప్పారు. సంస్థ కార్యదర్శి ఆకునూరి శారద మాట్లాడుతూ ఎస్‌వి రామారావు, వినోద్ బాబు, రాము వంటి ప్రముఖులచే అక్కినేని మధుర గీతాల సంగీత విభావరి జరుగుతుందని చెప్పారు.